

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం

30 మే 2025 పేజీలు : 08


■ మంత్రి నారాయణ ఆలోచనలకు అనుగుణంగా

# మా నాన్న కడిగిన ముత్యంలా.. బయటకు వస్తారు

## కాకాణి కుమార్తె పూజిత

- నా తండ్రి నిజాయితీ.. వ్యక్తిత్వం గురించి ప్రజలకు తెలుసు
- జిల్లా పరిషత్ చైర్మన్, మంత్రిగా నిస్వార్థ సేవలందించారు
- అక్రమ కేసులతో అన్యాయంగా అరెస్టు చేశారు



నెల్లూరు, మేజర్‌న్యూస్ :

మా నాన్నను అక్రమంగా అరెస్టు చేశారని, తమ నాన్న కడిగిన ముత్యంలా బయటకు వస్తారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి కుమార్తె పూజిత వెల్లడించారు. గురువారం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ రోజు నుండి ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. తన తండ్రి అక్రమ అరెస్ట్‌పై మాట్లాడేందుకు మీడియా ముందుకు వచ్చానని పేర్కొన్నారు. తన తండ్రి నిజాయితీ.. వ్యక్తిత్వం గురించి ప్రజలకు తెలుసునని వివరించారు. అభివృద్ధి, ప్రజల సంక్షేమం తప్ప వేరే ఆలోచన చేయకుండా ఉండే వ్యక్తి మా నాన్న అన్నారు. కోవిడ్ సమయంలో ప్రజల కోసం 24 గంటలు కష్టపడి పని చేశారన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఆ పదవికి వన్నె తీసుకుని వచ్చారని, రెండుసార్లు సర్వేపల్లి నుంచి ఎమ్మెల్యేగా.. ఒకసారి మంత్రిగా పని చేసిన వ్యక్తి, -మిగతా 2లో

# వీఆర్ హైస్కూల్ రూపురేఖలు మార్పు



- వీఆర్ హైస్కూల్ అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి కుమార్తె పొంగూరు షరణి
- మా నాన్న ఉన్నత స్థితికి వీఆర్ హైస్కూల్లో చదువుకోవడమే పునాది
- ప్రతి తరగతి గదిలో డిజిటల్ స్క్రీన్స్ ఏర్పాటు ఇంటర్నేషనల్ స్థాయిలో ప్లే గ్రౌండ్
- అనుభవం.. మెలకువలు తెలిసిన ఉపాధ్యాయులు ఎంపిక
- సిబ్బందికి పలు సూచనలు ఇచ్చిన పొంగూరు షరణి

నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :

భవిష్యత్ తరాల విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని, రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆలోచనలకు అనుగుణంగా వీఆర్ హైస్కూల్‌ను ఇంటర్నేషనల్ స్థాయిలో తీర్చిదిద్దుతున్నట్లు మంత్రి నారాయణ కుమార్తె పొంగూరు షరణి తెలియజేశారు. నెల్లూరు వీఆర్ హైస్కూల్లో జరుగుతున్న ఆధునీకరణ అభివృద్ధి పనులను గురువారం ఆమె క్షేత్రస్థాయిలో ఎన్‌సీసీ సిబ్బందితో కలిసి పరిశీలించారు. హై స్కూల్‌లోని ప్రతి తరగతి గదికి వెళ్లి జరుగుతున్న అభివృద్ధి పనులను సిబ్బందిని అడిగి 2లో



# టీడీపీకి కార్యకర్తలే.. బలం భవిష్యత్

- కోవూరు నుంచి 100 కార్లు, 30 బస్సుల్లో మహానాడుకు పయనం
- బుచ్చిరెడ్డిపాలెంలో జెండా ఊపి.. వాహనాలను ప్రారంభించిన ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతమ్మ
- గొప్ప నాయకులతో కలిసి ప్రయాణం చేయడం అదృష్టం

బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :

కోవూరు నియోజకవర్గం పసుపుమయమైంది. మహానాడుకు బయలుదేరుతున్న నాయకులు, కార్యకర్తలతో సందడి వాతావరణం నెలకొంది. బుచ్చిరెడ్డిపాలెంలో మహానాడుకు బయలుదేరుతున్న బస్సులను నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలం, భవిష్యత్తు అన్నారు. కార్యకర్తల గుండెల్లో స్థానం సంపాదించుకున్న సీఎం చంద్రబాబు నాయుడు, లోకేష్‌తో కలిసి పని చేయడం అదృష్టమన్నారు. యువతకు ప్రాధాన్యత నిస్తూ.. నారా లోకేష్ పార్టీని ముందుకు నడిపిస్తున్నారన్నారు. మహానాడుకు గత రెండు రోజులుగా భారీ సంఖ్యలో కార్యకర్తల హాజరయ్యారని, అనేక అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, లోకేష్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారన్నారు. భారీ బహిరంగ సభ నేపథ్యంలో కోవూరు నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు కడప మహానాడుకు -మిగతా 2లో




# మహానాడు సూపర్ హిట్

లోపల పేజీలో


# సెలవుపై వెళ్ళిన కలెక్టర్

## ఇన్చార్జి కలెక్టర్‌గా కార్తీక్



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ 15 రోజులు పాటు సెలవుపై వెళ్లారు. వ్యక్తిగత కారణాలపై ఆయన సెలవు తీసుకున్నారు. ఎఫ్ఏసీగా కలెక్టర్ బాధ్యతలను జాయింట్ కలెక్టర్ కే.కార్తీక్‌ను నియమించారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. శుక్రవారం నుంచి ఎఫ్ఏసీ బాధ్యతలను కార్తీక్ చేపడుతారు.

# కడపలో కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వడ్ల మూడి రమేష్ చౌదరి ఆధ్వర్యంలో కడప పట్టణంలోని కోటిరెడ్డి సెంటర్లో తెలుగుదేశం పార్టీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి కేక్ కట్ చేశారు. అనంతరం పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు గిరిధర్ రెడ్డిని శాలువాలతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గూటూరు శ్రీధర్ నాయుడు, మావులూరు జైసన్ రెడ్డి, వరదరాజుల రమేష్‌నాయుడు, గోవిందు, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

# టీడీపీకి కార్యకర్తలే.. బలం, భవిష్యత్

*(మొదటి పేజీ తరువాయి)*

తరలివచ్చారన్నారు. 100 కార్లు, 30 బస్సుల్లో మహానాడుకు వస్తున్నారన్నారని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా మహానాడుకు చేరుకోవాలని, కార్యక్రమం అనంతరం తిరిగి జాగ్రత్తగా వారి వారి స్వస్థలాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మా నాన్న కడిగిన ముత్యంలా

# బయటకు వస్తారు



*(మొదటి పేజీ తరువాయి)*

నాకు ఎవరన్నా ఫోన్ చేసినా.. మా నాన్న ప్రజల కోసం పని చేసే వ్యక్తి అని, నేరుగా వెళ్ళి 24 గంటల్లో ఎప్పుడైనా ప్రజలు కలిసే అవకాశం ఉండేదన్నారు. కిందిస్థాయి నుండి పైకి వచ్చిన వ్యక్తి కాబట్టి ఆయనకు ప్రజల కష్టాలు తెలుసునని చెప్పారు. మా తాత నుండి నిజాయితీగా రాజకీయాలు చేస్తున్నామన్నారు. తప్పుడు కేసులు పెట్టి అక్రమంగా అరెస్ట్ చేసి మా నాన్నను కష్టాలు పెట్టడం సరికాదన్నారు. నియోజకవర్గంలో ప్రజలు చాలా మంది ఫోన్ చేసి గోవర్ధన్ రెడ్డిపై తప్పుడు కేసులు పెడతారని చెప్పేవారు. మా నాన్నపై చాలా దుష్ప్రచారాలు జరుగుతున్నాయని, ఇది బాధాకరమన్నారు. కేసులు అనేవి మా నాన్నకు కొత్త కాదు.. ఎన్నోసార్లు కేసులు పెట్టినా, పోలీసు విచారణకు హాజరు అయ్యేవారన్నారు. న్యాయ స్థానంలో బెయిల్ పిటిషన్ రన్ అవుతుంది కాబట్టి న్యాయ స్థానం తీర్పు కోసం ఎదురు చూశామన్నారు. సుప్రీం కోర్టులో మేమే కేసును కొన్ని సాంకేతిక కారణాలు వలన వెనక్కు తీసుకున్నాం తప్ప.. బెయిల్ పిటిషన్ కొట్టేయలేదన్నారు. కాల చక్రం బలమైంది, ఈ రోజు మా సమయం కాకపోవచ్చు కానీ, మాకు ఓ రోజు వస్తుందని హెచ్చరించారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా నాయకులు, కార్యకర్తలు మాతోనే ఎన్నారని పేర్కొన్నారు. మాతో కలిసి ఉన్న అందరికీ ధన్యవాదాలు తెలిపారు. మా నాన్న అరెస్ట్ అయినప్పటి నుండి జిల్లా ప్రజలు, సర్వేపల్లి నియోజక ప్రజలు, వైసీపీలోని అందరూ మాకు అండగా ఉన్నారన్నారు. సర్వేపల్లి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలందరికీ నేను నిత్యం అందుబాటులో ఉంటామని, వారి కోసం పోరాటం చేస్తామన్నారు. అక్రమ కేసులు ఎంతో కాలం నిలబడవన్నారు.

# కాకాణి పూజితకు అండగా ఉంటాం

## వైసీపీ యువజన, విద్యార్థి విభాగం నేతలు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు డైకాస్ రోడ్‌లో కాకాణి గోవర్ధన్ రెడ్డి కుమార్తె కాకాణి పూజితని వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు, కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు ఆశ్రిత్ రెడ్డి కలిసి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా అయన మాట్లాడు తూ.. కాకాణి గోవర్ధన్ రెడ్డి నిప్పులాంటి మనిష అని, న్యాయస్థానాల్లో ఆయన తన నిజాయితీ నిరూపించుకొని క్లీన్ చీట్‌తో బయటికి వస్తారని వారు తెలిపారు. గోవర్ధన్ రెడ్డి విషయంలో కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న తీరును ఎండగట్టారు. కాకాణి గోవర్ధన్ రెడ్డిపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసు బనాయించి అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ అక్రమ కేసులు బనాయిస్తూ కక్ష్య సాధింపు చర్యలకు దిగడం ఆ పార్టీ పతనానికి నాంది అన్నారు. ప్రశ్నించే గొంతు నొక్కేందుకే వైసీపీ నేతలపై ఈ విధంగా అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. రాబోయే రోజుల్లో ప్రజా క్షేత్రంలో తెలుగుదేశం పార్టీకి పరాభవం తప్పదని హెచ్చరించారు.

## కాకాణి పూజితతో అనిల్ కుమార్ యాదవ్ భేటీ

### వైసీపీ అండగా ఉంటుందని భరోసా



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని డైకాస్ రోడ్డు నివాసంలో కాకాణి పూజితమ్మతో మర్యాదపూర్వకంగా గురువారం మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమెకు తమ సంఘీభావాన్ని తెలియజేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఆఫ్కాఫ్ మాజీ చైర్మన్ కొండూరు అనిల్, మందల వెంకట శేషయ్య, తదితరులు ఉన్నారు.

# మంత్రి నారాయణ ఆలోచనలకు అనుగుణంగా వీఆర్ హైస్కూల్ రూపురేఖలు మార్పు



*(మొదటి పేజీ తరువాయి)*

తెలుసుకున్నారు. అదేవిధంగా ప్రతి తరగతి గదిలో ఏర్పాటు చేసిన 86 ఇంచెస్ డిజిటల్ స్క్రీన్‌లను స్వయంగా పరిశీలించారు. నూతనంగా ఏర్పాటు చేస్తున్న ల్యాబ్స్‌ను తనిఖీ చేశారు. అధునాతన హంగులతో తీర్చిదిద్దుతున్న క్రీడా మైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి కుమార్తె పొంగూరు షరణి మాట్లాడుతూ.. వీఆర్ హైస్కూల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో ప్రతిరోజు పరిశీలిస్తున్నట్లు చెప్పారు. గత కొన్ని రోజులుగా వీఆర్ హైస్కూల్లో అభివృద్ధి పనులు శరవేగంగా నాణ్యతా ప్రమాణాలతో జరుగుతున్నాయని తెలిపారు. మా నాన్న ఈ స్కూల్లో చదివారని, అయితే అప్పట్లో సరైన వసతులు లేవన్నారు. కానీ ఈరోజు మా నాన్న ఈ స్థాయికి రావడానికి వీఆర్ స్కూల్లో చదువుకోవడమే పునాది అని షరణి చెప్పారు. ప్రస్తుతం తాను ఈ స్థాయిలో ఉన్న కాబట్టి తాను చదువుకున్న స్కూల్‌కి ఏదో ఒకటి చేయాలని మంత్రి నారాయణ మహా సంకల్పానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఆ విధంగా అధునాతన హంగులతో వీఆర్ హైస్కూల్‌ను తీర్చిదిద్దాలన్న బాధ్యతను తనపై ఉంచారన్నారు. గడిచిన నెల రోజులుగా ఎంతో పట్టుదలతో మంత్రి నారాయణ ఆశయాలకు అనుగుణంగా ఎన్సీసీ వారు ఇక్కడ అభివృద్ధి పనులను శరవేగంగా చేపడుతున్నారని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన అర్థవంతమైన విద్యను అందించేందుకు ప్రత్యేక ప్రణాళికతో వీఆర్ హైస్కూల్లో ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 86 ఇంచెస్ స్క్రీన్‌తో ఏర్పాటు చేసిన ప్రత్యేక తరగతి గదులు విద్యార్థులను ఎంతగానో ఆకర్షించడంతోపాటు చదువు పట్ల ఆసక్తి చూపేలా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా వీఆర్ హైస్కూల్లో నూతన టెక్నాలజీకి అనుగుణంగా అన్ని రకాల సబ్జెక్టులకు సంబంధించి ల్యాబ్స్ సర్వాంగ



సుందరంగా తీర్చిదిద్దామని తెలిపారు. మా నాన్న ఆలోచనకు అనుగుణంగా వీఆర్ హైస్కూల్లోని అన్ని తరగతుల గదులలో డిజిటల్ స్క్రీన్స్ ద్వారా విద్యా బోధన చేపడుతున్నట్లు చెప్పారు. అదేవిధంగా ఇంటర్నేషనల్ స్థాయిలో క్రీడా ప్రాంగణాన్ని రూపొందిస్తున్నట్లు పొంగూరు షరణి తెలిపారు. ఏదేమైనా పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఇంటర్నేషనల్ స్థాయిలో వీఆర్ హైస్కూల్‌ను రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. స్టీమ్ విధానం ద్వారా విద్యార్థులకు అన్ని సబ్జెక్టులలో అర్థమంతమైన విద్య బోధన చేయనున్నట్లు చెప్పారు. అదేవిధంగా హైడ్రో ఫోనిక్స్ టెక్నాలజీని వీఆర్ హైస్కూల్లో ప్రత్యేకంగా ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయుల ఎంపిక సైతం శరవేగంగా జరుగుతుందన్నారు. ఒకప్పుడు వీఆర్ హైస్కూల్ ఎలా ఉండేదో, ఇప్పుడు ఎలా ఉండబోతుందో చేసి చూపించబోతున్నామని షరణి తెలిపారు.

# ఘనంగా కామ్రేడ్ జక్కా వెంకయ్య వర్ధంతి



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) మున్సిపల్ వర్కర్స్ శాఖల ఆధ్వర్యంలో నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిధిలోని ఏసీ నగర్ సెంటర్లో నెల్లూరు జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత కామ్రేడ్ జక్కా వెంకయ్య 7వ వర్ధంతి సందర్భంగా గురువారం ఆయన చిత్రపటానికి పూలమాల,పూలు వేసి నివాళులర్పించే కార్యక్రమాన్ని సిపిఎం కార్యకర్తలు నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు,నగర కార్యదర్శి వర్గ సభ్యులు పి.సూర్యనారాయణ మాట్లాడుతూ.. నెల్లూరు జిల్లాలో సిపిఎం పార్టీని ప్రజలలో నిర్మించడంలో జక్కా వెంకయ్య మరువలేని పాత్ర వహించారని అన్నారు. జిల్లాలోని చెరువు లోతట్టు భూములను పేదలకు పంచడంలో అనేక పోరాటాలు నిర్వహించి వేలాది ఎకరాలు బలహీన వర్గాలకు పంచిపెట్టడం జరిగినదని తెలిపారు. అనేక రైతాంగ పోరాటాలకు కార్మిక పోరాటాలకు నాయకత్వం వహించి నిర్వహించిన ఘనత జక్కా వెంకయ్యదని అన్నారు. భారతదేశంలో ప్రజల సమస్యలకు పరిష్కారం సోషలిస్టు వ్యవస్థతో మాత్రమే సాధ్యమని నమ్మి జీవితాంతం నమ్మిన సిద్ధాంతం కోసం నడిచిన గొప్ప నాయకుడు కామ్రేడ్ జక్కా వెంకయ్య అని అన్నారు. రెండు సార్లు సీపీఎం పార్టీ ఎమ్మెల్యేగా నెల్లూరు జిల్లాలో ఎన్నికై జిల్లా అభివృద్ధికి అనేక పరిశ్రమలు కృష్ణ పట్నం పోర్టు ప్రాజెక్టులు ప్రతిపాదించి సాధించేంత వరకు ప్రజలను సమీకరించి పోరాటంలో జక్కా వెంకయ్య విజయవంతం అయ్యారని అన్నారు. సైతాంతిక పటిమ, పోరాటాల రూపకల్పన ఆచరణ చేయగలిగిన నాయకులు కార్యకర్తలను తయారు చేయడంలో జక్కా వెంకయ్యది ప్రత్యేక పాత్ర అని అన్నారు. భౌతికంగా మన మధ్య జక్కా వెంకయ్య గారు లేకపోయినా ఆయన అందించిన ఆశ స్ఫూర్తిని ముందుకు తీసుకు వెళ్లేందుకు ప్రజా పోరాటాలు ఉద్యమాలను నెల్లూరు నగరంలో అభివృద్ధి చేసి కమ్యూనిస్టు పార్టీని ముందుకు తీసుకువెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నెల్లూరు నగర కమిటీ సభ్యులు బీపీ నరసింహ, శాఖా కార్యదర్శులు మట్టిపాటి శ్రీనివాసులు, ఎం.అశోక్, తాళ్లూరు భాగ్యమ్మ, నాయకులు జి.కామాక్షమ్మ, జి.కొండమ్మ, తాళ్లూరు లోకేష్, జి.సురేంద్ర, మారుతీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కత్తులతో బెదిరించి డబ్బు అపహరించిన కేసులో ఇద్దరు వ్యక్తులు అరెస్ట్



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** చెడు వ్యసనాలకు బానిసలై మద్యానికి అలవాటు పడి.. జన సంచారం తక్కువగా ఉండే సమయంలో సామాన్య ప్రజలను బెదిరించి డబ్బు అపహరించే ఇద్దరు నేరస్తులను నవాబు పేట పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే పాతచెక్ పోస్ట్ నివాసి అయినా ఎమ్మేటి వెంకయ్యను బుధవారం బోడీగాడి తోట వద్ద ఇద్దరు వ్యక్తులు మద్యం త్రాగుటకు డబ్బు కావాలని కత్తులతో బెదిరించి డబ్బు అపహరించుకొని వెళ్లారని అందిన ఫిర్యాదు మేరకు రెండో పట్టణ నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా ముద్దాయిలు అరవ అజిత్ (20) భగత్ సింగ్ కాలనీ, షేక్ ఉస్మాల్‌ఏదావూ(24) జనార్ధన్ రెడ్డి కాలనీ వ్యక్తులుగా ఈ ముద్దాయిలు గతంలో నవాబుపేట స్టేషన్ పరిధిలో పలు నేరాలలో జైలుకు వెళ్లిన పాత నేరస్థులుగా గుర్తించి గురువారం ముద్దాయిలను జగనన్న కాలనీ దగ్గర మధ్యవర్తుల సమక్షంలో విచారించగా వారు నేరాన్ని ఒప్పుకొనగా వారిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రెండు కత్తులు, నగదును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కి పంపినట్లు నవాబు పేట సీఐ వేణుగోపాల్ రెడ్డి తెలియజేశారు.

# తండ్రిని హత్య చేసిన కేసులో కుమారుడికి జీవిత ఖైదు



**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** చెడు అలవాట్లకు బానిసై మద్యానికి డబ్బు ఇవ్వలేదన్న కక్షతో కన్న తండ్రిని దారుణంగా కత్తితో పొడిచి హత్య చేశాడనే ఆరోపణ రుజువు కావడంతో నిందితుడు షేక్ తాజుద్దీన్‌కు యావజ్జీవ కారాగార శిక్షతోపాటుపాటు రూ.10వేల రూపాయల జరిమానా విధిస్తూ నెల్లూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ గురువారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి.. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం నెల్లూరు వేదాయపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని బుజబుజ నెల్లూరు చెన్నకేశవరెడ్డి నగర్‌లో షేక్ మస్తాన్, అతని కుమారుడు నిందితుడు షేక్ తాజుద్దీన్, నిందితుడి భార్య తహిర, నిందితుడు తల్లి ఉమ్మడి కుటుంబంగా కలిసి జీవించేవారు. హతుడు షేక్ మస్తాన్ రియల్ ఎస్టేట్ వ్యాపారం, కత్తులు సానబట్టి పనిచేసేవాడు, కాగా నిందితుడు షేక్ తాజుద్దీన్ చెడు వ్యసనాలకు బానిసై ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులతో నిత్యం తగాదా పెట్టుకునేవాడు. ఇతని వేధింపులు భరించలేక నిందితుడి భార్య తన పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్ళిపోయింది. ఈ నేపథ్యంలో హతుడు మస్తాన్ భార్య కూడా విజయవాడలోని బంధువుల ఇంటికి వెళ్ళింది. ఈ నేపథ్యంలో 2021 జూన్ 4న తన చెడు అలవాట్లకు, మద్యానికి డబ్బులు అందించలేదన్న కక్షతో ఒంటరిగా ఇంటిలో ఉన్న కన్న తండ్రి మస్తాన్‌ను తాగుడు మైకంలో నిందితుడు తాజుద్దీన్ కత్తితో పొడిచి హత్య చేశాడు. అనంతం నిందితుడు తాజుద్దీన్ పారిపోవటంతో బంధువులకు అనుమానం వచ్చి ఇంటిలో పోయి చూడగా అక్కడ దారుణ హత్యకు గురైన మస్తాన్ మరణించి ఉండటం చూసి వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడు తాజుద్దీన్‌ను అరెస్టు చేసి సాక్ష్యాధారాలతో నిందితుడు తాజుద్దీన్‌పై కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు విచారణ అనంతరం న్యాయమూర్తి తీర్పు చెప్పారు. నేరం రుజువు కావడంతో నిందితుని యావజ్జీవ శిక్షతోపాటు పది వేల రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

# సర్వేపల్లి నుంచి మహానాడు తరలిన కార్యకర్తలు



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం పార్టీ కీలక వార్షిక సదస్సైన మహానాడు తరుణంలో, సర్వేపల్లి నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పార్టీ నాయకుడు సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నేతృత్వంలో, వెంకటాచలం మండలంలోని అన్ని గ్రామాల నుంచి దాదాపు 1500 మంది కార్యకర్తలు కడప మహానాడు వైపు బయలుదేరారు. ఈ తరలింపు పార్టీకి ప్రాదేశిక స్థాయిలో బలాన్ని చాటుతోంది. నాయకత్వంపై కార్యకర్తల్లో ఉన్న నమ్మకాన్ని ఈ పెద్ద సంఖ్యలో హాజరు అయిన కార్యకర్తలు ప్రతిబింబిస్తున్నారని పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. గ్రామస్థాయిలో పార్టీ మళ్లీ పునరుజ్జీవనం అవుతోందన్న సంకేతాలు కూడా దీనివల్ల కనిపిస్తున్నాయి. పార్టీ జెండాలు చేతబట్టి, నినాదాలతో ఊరేగిన కార్యకర్తలు కడప మహానాడును ఘనంగా విజయవంతం చేయాలని సంకల్పించారు.

# మహానాడుకు తరలిన మర్రిపాడు టీడీపీ శ్రేణులు



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలం నుంచి ఆత్మకూరు ఏఎంసీ చైర్మన్ అరికట్ల జనార్దన్ నాయుడు మండల టీడీపీ అధ్యక్షులు దేవరాల గంగాధర్ యాదవ్, శాఖమూరి నారాయణ ఆధ్వర్యంలో మర్రిపాడు నుంచి అధికసంఖ్యలో మహానాడుకి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గురువారం తరలి వెళ్లారు.మహానాడుకి వెళ్ళేవారికి రాజుపాలెం హైవే పక్కన భోజనం ప్యాకెట్లు ముందు జాగ్రత్త చర్యగా పంపిణీ చేయడం జరిగింది. ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాలు మేరకు మహానాడుకి వెళ్లే టీడీపీ కార్యకర్తలకు, అభిమానులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా దగ్గరుండి పర్యవేక్షిస్తున్న ఆత్మకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆరికట్ల జనార్దన్ నాయుడు మండల టీడీపీ అధ్యక్షులు దేవరాల గంగాధర్ యాదవ్ శాఖమూరి నారాయణ చూశారు. అందరిని కలుపుకొని మహానాడుకి వెళ్ళేవారిని ఆప్యాయంగా పలకరిస్తూ ఏర్పాట్లు పర్యవేక్షణతో బయలుదేరి వెళ్లారు.


## MUNICIPAL CORPORATION : NELLORE

### TENDER NOTICE

ROC. No. 315 /NMC/DB/**GEN/CSR FUNDS**/2025-26 Dt : 29.05.2025

Nellore Municipal Corporation hereby invites tenders for
1) Supply, Delivery and Fixing of 4MP Bullet Cameras Urban Constituency (28 Divisions)
2) Supply, Delivery and Fixing of PTZ IP cameras Urban Constituency (28 Divisions)

No. of Works -02 : Amount of Rs. 300 Lakhs

Bid Document Download Start Date& Time : 02.06.2025 at 10.00 PM
Bid Submission Closing Date & Time : 16.06.2025 at 3.00 PM

Further details can be seen at e-procurement market place in www.apeprocurement.gov.in officer inviting bids Commissioner, Municipal Corporation of Nellore, A.P. Contract No. +91 91770 55089, 98499 06608 & 88975 07428.

I/T.C.F.B.O//

Sd/- Y.O.Nandhan.,
Commissioner
Municipal Corporation : Nellore

# మహానాడులో ఉదయగిరి సత్తా చాటిన ఎమ్మెల్యే కాకర్ల



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా కడపలో చేపట్టిన మహానాడు కార్యక్రమానికి ఉదయగిరి నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో తరలి వెళ్లారు ఉదయం 8 గంటలకే కలిగిరి కొండాపురం జలదంకి మండలాల నుండి వింజమూరు తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయం దగ్గరకు చేరుకోగా ఎమ్మెల్యే నాయకులకు స్వాగతం పలికి వింజమూరు నుండి దుత్తలూరు బయలుదేరి వెళ్లారు దుత్తలూరులో వరికుంటపాడు ఉదయగిరి సీతారాంపురం మండలాల నుండి వివిధ వాహనాలలో విచ్చేసిన నాయకులను కాకర్ల ఆత్మీయంగా పలకరించి ఒక్కసారిగా జై చంద్రబాబు జై నారా లోకేష్ జై కాకర్ల అంటూ నినాదాలతో వాహన శ్రేణి కదిలింది. గత గతంలో ఎన్నడూ కూడా ఇంత పెద్ద ఎత్తున వాహనాలలో ఉదయగిరి నియోజకవర్గంలో నుండి తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు తరలి వెళ్లిన సందర్భం లేదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు కాకర్ల సురేష్ నాయకత్వం పై నమ్మకంతో నియోజకవర్గంలోని ప్రతి మండలంలో పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు అభిమానులు తరలి వెళ్లడమే ఇందుకు నిదర్శనం అని పలువురు భావించారు నియోజకవర్గంలో ప్రతి మండలం నుండి అధిక సంఖ్యలో బస్సులు సుమారు 200 కార్లలో తరలి వెళ్లడం తెలుగుదేశం పార్టీ పై ప్రజలకున్న అభిమానం వ్యక్తం అవుతుంది.

## మహానాడులో ఎమ్మెల్యే కాకర్ల ఫ్లెక్సీ ఏర్పాటు




**జలదంకి, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం పార్టీ పండుగ మహానాడు సందర్భంగా మహానాడు ప్రాంగణంలో జలదంకి మండల టీడీపీ యువనేత మునగాల తిరుమలరెడ్డి తమ అభిమాన ఎమ్మెల్యే కాకర్ల సురేష్ భారీ ఎత్తు కటౌట్ ఏర్పాటు చేసి, ఎమ్మెల్యే పట్ల తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. కావలి, ఉదయగిరి నియోజకవర్గ పార్టీ నేతలు, కార్యర్తలు ఈ ఫ్లెక్సీ చూసి ఎక్కడ జలదంకి, ఎక్కడ కడప అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. యువనేత మునగాలను అభినందిస్తున్నారు. తమకు ఈ ఆలోచన ఎందుకు రాలేదు అనుకుంటున్నారు. ఈ ఫ్లెక్సీ ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది.

## కరెంట్ సమస్యలు పరిష్కరించండి

▸ చిన్నక్రాక గ్రామస్తులు



**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి మండలం చిన్నక్రాక గ్రామంలో కరెంటు సమస్యలను ఎదుర్కొంటున్న గ్రామస్తులు. ప్రభుత్వ అధికారులు రైతులకు రెండో పంట వేసుకునేందుకు సోమశిల నుండి నీరు విడుదల చేసిన సందర్భంలో విద్యుత్ మోటార్ కనెక్షన్లకు సంబంధించి కరెంటు లేకపోవడంతో ఆ గ్రామ లైన్‌మెన్‌ను పలుమార్లు గ్రామస్తులు కరెంటు ఇవ్వవలసిందిగా కోరగా లైన్‌మెన్ తమ దురుసు ప్రవర్తనతో అన్నదాతల మీద పొంతనలేని సమాధానంతో దురుసు ప్రవర్తనతో వ్యవహరిస్తూ, అదేమంటే మీరు ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి నేనింతే అనే ధోరణితో వ్యవహరిస్తున్నాడని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చిన్నక్రాక గ్రామ లైన్మెన్ మీద చర్యలు తీసుకొని తమకు కరెంటు కష్టాలు తీర్చాలని కోరుకుంటున్నారు.

# పరిపూర్ణ తెలుగు మాధ్యమ పాఠశాలలు లేని తెలుగు రాష్ట్రం ఏపీ

### బీజేపీ నేత మిడతల రమేష్



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో పరిపూర్ణ తెలుగు మాధ్యమ పాఠశాలలు కొనసాగించాలని బీజేపీ నేత మిడతల రమేష్ నెల్లూరు కలెక్టర్ కార్యాలయంలో డిఆర్‌ఓ ఉదయభాస్కర్. నెల్లూరు ఆర్డీవో నాగ అనూషలకు విజ్ఞప్తి చేశారు. తెలుగు వారి ఆత్మగౌరవంను ప్రపంచానికి చాటిన ఎన్టీఆర్ జయంతినీ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న సందర్భంగా రమేష్ తెలుగు మాధ్యమ పాఠశాలల కొరకు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం అనధికారకంగా తెలుగు మాధ్యమ పాఠశాలలను ఎత్తేసి నిర్బంధ ఆంగ్ల మాధ్యమం నిర్వహించడం వలన రాష్ట్రంలో 30 శాతం మంది గ్రామీణ విద్యార్థులు సమగ్రమైన విద్య అవగాహనను కోల్పోయారన్నది చారిత్రాత్మక సత్యం. అందుకో లేకుండా మన తెలుగు రాష్ట్రంలో తమిళం ఉర్దూ మాధ్యమ పాఠశాలలు కొనసాగుతున్నాయి. తెలుగు మాధ్యమ పాఠశాలలు మాత్రం తెలుగు ప్రజలకు ప్రపంచ బ్యాంకు నిధులు కోసం తెలుగు మాధ్యమాన్ని తాకట్టు పెట్టడం ఆందోళన కలిగించే అంశంగా రమేష్ పేర్కొన్నారు. ఒకవైపు తెలుగు భాషా రాష్ట్రం కోసం ఆత్మార్పణ చేసిన పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు నిర్వహిస్తున్నాము. నేడు తెలుగు వారి ఆత్మగౌరవాన్ని ప్రపంచ దేశాల ముందు ఉంచిన ఎన్టీఆర్ జయంతిని అధికారికంగా కానీ తెలుగు ప్రజలకు తెలుగు మాధ్యమం దూరమవడం బాధాకరమన్నారు. గత ప్రభుత్వం తెలుగు మాధ్యమ పాఠశాలలను ఎత్తివేసి తప్పు చేశారు. అటువంటి తప్పులు పునరావృతం కాకుండా రాష్ట్రంలో తెలుగు మాధ్యమాన్ని ఆంగ్ల మాధ్యమాన్ని రెండింటిని కొనసాగించాలని రమేష్ డిమాండ్ చేశారు. లేకుంటే తెలుగు భాష ప్రభుత్వం తెలుగు ప్రజలకు దూరమవుతుంది. భవిష్యత్తులో వందల సంవత్సరాలుగా వస్తున్న తెలుగు భాష ప్రమాద స్థితికి చేరుతుందని ఆవేదన వ్యక్తం తెలుగు భాషను కాపాడుకోవడం కోసం తెలుగు మాధ్యమ పాఠశాలలను కొనసాగించాలని రమేష్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అల్లూరు నాగేంద్ర సింగ్, నరాల సుబ్బారెడ్డి, ఏవి సుబ్బయ్య, పద్మావతి, కేశవ, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ జక్కా వెంకయ్య 7వ వర్ధంతి కార్యక్రమం



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలంలోని పొట్టేపాలెం, దేవరపాలెం ములుమూడి, సౌత్ మోపూరు, కందమూరు, పాత వెల్లంటి, దొంతాలి గ్రామాలలో నెల్లూరు జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత కామ్రేడ్ జక్కా వెంకయ్య 7వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా జెవి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మజ్జిగ చలివేంద్రాలు, రక్తదాన శిబిరాలు నిర్వహించారు. పాతవెల్లంటి గ్రామంలో 32మంది యువకులు రక్తదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఎం సెక్రటేరియట్ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మార్క్సిస్టు మేధావి, ఆదర్శ కమ్యూనిస్టు జిల్లాలో ఏ సమస్య వచ్చినా మార్క్సిస్టు దృక్పథంతో పరిశీలించి పరిష్కారం చెప్పగలిగిన నాయకుడని అన్నారు. జిల్లాలో లోతట్టు చెరువు సాగుదారుల పోరాటం భూపోరాటం, ఇండ్ల స్థలాల పోరాటాలను ముందుండి నడిపి భూములను సాధించిన వర్గ పోరాటాల వేగుచుక్కని అన్నారు. పొట్టీపాలెంలో పాల్గొన్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆలూరు తిరుపాలు, సీనియర్ నాయకులు మాట్లాడుతూ.. జెవి కడ వరకూ నిరాడంబరంగా జీవించి ప్రజల హృదయాలలో కమ్యూనిస్టుగా నిచాడని వర్గ పోరాటాలకు మార్గ దర్శి అనీ అన్నారు. ఈ కార్యక్రమంలో పాత వెల్లంటి గ్రామ సర్పంచ్ పాదర్తి రాధ, సిపిఎం మండల కార్యదర్శి పి.జనార్ధన్, యడవల్లి రమణయ్య, ముత్యాల నాగయ్య, అట్ల అనిల్, జానా లక్ష్మి ప్రసాద్, పచ్చురు ప్రభాకర్, పి.చెంచయ్య, పి.సుబ్రహ్మణ్యం, గుంటి నాగరాజు, శ్రీపతి వెంకయ్య, శ్రీపతి దయాకర్, పాదర్థి నారాయణ, జి.వెంకటేశ్వర్లు, సాంబయ్య, శివకుమార్, వీ.వెంకటర మణయ్య, బాలు ఆది శేషయ్య, అచ్చి అనంతయ్య, ఎన్‌వీ రమణయ్య, కేశం హరి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కామ్రేడ్ జక్కా వెంకయ్య ఏడవ వర్ధంతి



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** బుచ్చిరెడ్డిపాళెంలో కామ్రేడ్ జక్కా వెంకయ్య 7వ వర్ధంతి సీపీఎం పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు టీవీవీ ప్రసాద్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెల్లూరు జిల్లా కమ్యూనిస్టు ఉద్యమంలో ఆయన ప్రముఖ పాత్ర వహించారన్నారు. పేద, బడుగు,బలహీన వర్గాల ప్రతినిధిగా వారి హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయేరు. బాబ్రీ మసీదు కూల్చివేత సందర్భంగా జరిగిన మతకలహాలు జిల్లాలో జరుగకుండా నిరోధించడంలో వెంకయ్య కీలకంగా వ్యవహరించి అందరి మన్ననలు పొందారు. నేటి యువతకు ఆయన ఆశయాలు, పోరాటాలు ఆదర్శం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి చల్లకొలుసు మల్లికార్జున రావు, అధ్యక్షులు షేక్ మునీర్ అహ్మద్, సీపీఎం పార్టీ కార్యదర్శి పొతంశెట్టి శ్రీనివాసులు, షేక్ జానిబాష, పడవల సుబ్రహ్మణ్యం, కొమ్మి శ్రీనివాసులు, సిఐటియు నాయకులు రాదయ్య, రాజయ్య, మాల్యాద్రి, మల్లికార్జున, రాహూల్ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# మహానాడు సూపర్ హిట్



# పసుపు మయంగా మారిన నెల్లూరు సిటీ నియోజకవర్గం

- మంత్రి పిలుపుతో మహానాడుకు భారీగా తరలి వెళ్లిన కార్యకర్తలు, అభిమానులు
- ప్రతి డివిజన్ నుంచి అనుచరగణంతో మహానాడు బాట పట్టిన నేతలు
- 28 డివిజన్‌లో పసుపు పండగ సందడి
- జై తెలుగుదేశం నినాదాలో హెూరెత్తిన నగర వీధులు
- ఫుల్ జోష్‌తో కనిపించిన తెలుగుదేశం పార్టీ నేతలు
- 5వేల మందికి పైగా మహానాడుకు తరలిన మంత్రి నారాయణ సైన్యం
- మంత్రి ఆదేశాలతో ఆరువేల మందికి సరిపడా ఆహారం ఏర్పాటు చేసిన టీడీపీ నేత వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి




**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు సిటీ నియోజకవర్గంలో పసుపుదళం కదం తొక్కింది. తమ అభిమాన నేత రాష్ట్ర పురపాలకశాఖామంత్రి పొంగూరు నారాయణ పిలుపుతో చేయి చేయి కలిపి మహానాడు బాట పట్టింది. అధికారంలోకి వచ్చాక తొలిసారిగా నిర్వహిస్తున్న మహానాడుకు నియోజకవర్గం ఐదువేల మందికి పైగా టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, నేతలు వస్తారని అంచనా వేసిన మంత్రి అనుచరగణం అందుకుతగ్గ ఏర్పాట్లు చేసి అందరి ప్రశంసలు అందుకొంది. కడపజిల్లాలో నిర్వహిస్తున్న రాష్ట్ర పసుపు పండగ మహెూత్సవ ముగింపు సభకు నెల్లూరు సిటీ నియోజకవర్గం నుంచి మంత్రి నారాయణ సైన్యం తరలి వెళ్ళింది. నియోజకవర్గంలోని 28 డివిజన్ల నుంచి 112 ప్రయివేట్ బస్సుల్లో టీడీపీ కార్యకర్తలు, అభిమానులు డివిజన్ ఇన్‌ఛార్జులతో పాటు రాష్ట్రమహానాడుకు గురువారం కదలి వెళ్లారు. తెలుగుతమ్ముళ్ల ఉత్సహాన్ని ముందే అంచనా వేసిన మంత్రి నారాయణ ఆరు వేల మందికి సరిపడా ఆహారం, ముప్పై వేల మంచి నీటి బాటిళ్లు ఏర్పాటు చేశారు. మంత్రి నారాయణ ఆదేశాలతో టీడీపీ నేత వెమిరెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి సిటీ లోని వెంకటేశ్వరపురం, పాలిటెక్నిక్ కాలేజ్, మైపాడు గేట్, రైల్వే ఫీడర్స్ రోడ్, నాలుగుకాళ్ల మండపం, పాత మున్సిపల్ కార్యాలయం, విఆర్సీ సెంటర్‌లతో పాటు, ఎస్వీజీఎస్ కాలేజ్ మైదానంలో బస్ పాయింట్స్ ఏర్పాటు చేసి ఒక్కో బస్సుకు 50 ఆహార పొట్లాలను చేర వేశారు. అక్కడనుంచి డివిజన్ సెంటర్‌లకు చేరిన బస్సుల్లో టీడీపీ కార్యకర్తలు ఉత్సహంగా కడప బయలుదేరారు. విక్టరీ సింబల్ చూపిస్తూ జై తెలుగుదేశం నినాదాలతో హెూరెత్తించారు. దాంతో నగర వీధుల్లో పసుపు సందడి నెల కొంది. పార్టీ క్యాడర్‌లో నూతనోత్సహం వెల్లి విరిసింది. టీడీపీ నేతల్లో ఫుల్ జోస్ కనిపించింది. రాష్ట్రంలో రాక్షస పాలన పోయి నారా చంద్రబాబు నాయుడి ఆధ్వర్యంలో రామరాజ్యం నడుస్తోందని టీడీపీ నేతలు అంటున్నారు. ఏడాది కాలంగా ప్రజలు సుఖసంతోషాలతో ప్రశాంత జీవనం గడుపుతున్నారన్నారు. మహానాడుకు రమ్మని మంత్రి నారాయణ ఇచ్చిన పిలుపుకు వేలాదిగా కార్యకర్తలు తరలి రావటం ఆనందంగా ఉందంటున్నారు.

# విజయకుమార్ రెడ్డికి పదోన్నతి

- తిరుపతి జలవనరులశాఖ ఎస్ఈగా పోస్టింగ్
- పలువురు అధికారులు, యూనియన్ల నాయకుల హర్షం



**నెల్లూరు / వేదాయపాళెం, మేజర్‌న్యూస్ :** తెలుగు గంగలో అంతర్భాగమైన ఎస్ఎస్ఎల్‌సీ ఎస్బీ డివిజన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పెదినె కాలువ విజయకుమార్‌రెడ్డిని సూపరింటెంటింగ్ ఇంజనీరుగా పదోన్నతి వరించింది. ఈమేరకు ప్రభుత్వం నుంచి అధికారికంగా జారీచేసిన ఉత్తర్వుల ప్రకారం ఆయన రిలీవ్ కావడంతో పాటు తిరుపతి జలవనరులశాఖ పర్యవేక్షక ఇంజనీరుగా భాధ్యతలు స్వీకరించడం పట్ల పలువురు ఇంజనీరింగ్, టెక్నికల్, ఇతర పరిపాలన విభాగాలకు చెందిన అధికారులు, ఉద్యోగ సంక్షేమ సంఘాల యూనియన్ల నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. భాధ్యతాయుతమైన విధినిర్వహణలో భాగంగా ఉన్నతాధికారుల మార్గదర్శకాలు శిరోధార్యంగా భావిస్తూ అనుసరించిన విధివిధానాలు, అంకితభావంతో కూడిన పనితీరు, ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాల సాధనలో రాజీపడని మనస్థత్వం. తీవ్ర పనిఒత్తిడి ఉన్నప్పటికీ కనిపించని అసహనం, మృదు స్వభావం, చెరగని చిరునవ్వు, స్నేహపూర్వక పలుకరింపులు వెరచి శాఖాపరమైన పురోగాభివృద్ధితో సాధించిన అనూహ్య విజయాలు మచ్చలేని ఉత్తమ ఇంజనీరుగా ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్న ఎస్ఎ స్ఎల్సీ ఎస్బీ డివిజన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పెదినేకాలువ విజయకుమార్‌రెడ్డి పనిచేసిన ప్రతిచోటా అవార్డులు, రివార్డులు.. 37ఏళ్ల సుదీర్ఘ ఉద్యోగ ప్రయాణంలో అనూహ్య విజయాలతో అందరి మన్ననలు చూరగొని ఈనెల 31న గౌరవప్రథంగా పదవీ విరమణ చేయనున్న తరుణంలో రెండు రోజులు ముందుగానే సూపరింటెంటింగ్ ఇంజనీరుగా పదోన్నతితో ప్రభుత్వం నుంచి తీపికబురు అందడం ఆయనకు దక్కిన అరుదైన గౌరవంగా భావించవచ్చునన్నారు.

# ఘనంగా కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఈరోజు 29వ డివిజన్ మహాత్మ గాంధీ నగర్‌లో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు బృంగిమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో 29వ డివిజన్‌లో పనిచేస్తున్నటువంటి పారిశుధ్య కార్మికులకు బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మన నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి గసంపూర్ణ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతోనిండు నూరేళ్ల జీవించాలని ఎమ్మెల్యేగా శాసనసభలో అడుగు పెట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 23, 24 క్లస్టర్ ఇన్‌చార్జ్ కనపర్తి గంగాధర్, స్థానిక కో-క్లస్టర్ ఇంచార్జ మమతారెడ్డి డివిజన్ అధ్యక్షులు గుద్దేటి చెంచయ్య రూరల్ మైనార్టీల అధ్యక్షులు షేక్‌అస్లాం మాజీ కార్పొరేటర్ మల్లబోయిన వెంకటేశ్వర్లు యాదవ్, నాదెళ్ల రాజా డివిజన్ ప్రధాన కార్యదర్శి మౌలాలి, నారాయణ నాయకురాళ్ళు మస్తానమ్మ, షాజహాన్, దయ కుమార్, రాము, సురేష్ రెడ్డి, సాదిక్, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.



# ఉచితంగా సోలార్ విద్యుత్ మీటర్ సర్వీసులు

- 30రోజుల లోపు సబ్సిడీ నేరుగా బ్యాంకు ఖాతాలో జమ
- నెల్లూర్ రూరల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు సోమశేఖర్‌రెడ్డి



**నెల్లూరు / వేదాయపాళెం, మేజర్‌న్యూస్ :** ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్తిబిజిలీ యోజన పథకం ద్వారా ఏపీ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందుబాటులోకి తెచ్చిన సౌర (సోలార్) విద్యుత్ మీటర్ సర్వీసులకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేకుండా ఉచితంగా అందజేస్తున్నట్లు నెల్లూర రూరల్ విద్యుత్ ఆపరేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఆదేపూడి సోమశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఆయన విడుదల చేసిన ప్రకటనలోని వివరాలిలా ఉన్నాయి. గృహ వినియోగదారులకు మరింత సౌలభ్యకర మైన సౌర విద్యుత్ సేవలందించే లక్ష్యంతో మీటర్ సర్వీసును ఏర్పాటు చేసుకునేందుకు ఒక్కరూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేకుండా ఉచితంగానే ప్రభుత్వం అందజేస్తుందన్నారు. సోలార్ విద్యుత్ కొరకు వినియోగదారుడు వెబ్సైట్లో నమోదు చేసుకున్న తర్వాత వెండర్ ఎంపిక జాబితాలో ఎంతమంది ఉన్నారన్న సమాచారం మొత్తం వెబ్‌సైట్‌లో పొందుపరచి ఉంటుందని, ఎంపికైన వెండర్కు సోలార్ పలకలతోపాటు సామాగ్రి ఉచితంగా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ మొత్తం ప్రక్రియ వెండర్, వినియోగదారులకు మాత్రమే సంబందించినదని, ఇందులో విద్యుత్ శాఖకు గానీ, సంస్థలో పనిచేసే అధికారులు, సిబ్బందికి ప్రత్యక్షంగాకానీ, పరోక్షంగా కానీ ఎలాంటి సంబందం ఉండదన్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత సమాచారమంతా ఆయా ప్రాంతాల్లోని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు లాగిన్‌కు వెళుతుందని, ఆయనే స్వయంగా వచ్చి పరిశీలించడం జరుగుతుందన్నారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు స్వయంగా వచ్చి తనిఖీ చేసిన తర్వాత సదరు వినియోగదారుడు ఇండియాలో తయారైన ప్యానెల్ వాడుతున్నారా.. లేదా.. లైటనింగ్ ఎరస్టర్ (పిడుగులు పడినప్పుడు సోలార్ ప్యానెల్స్ దెబ్బతినకుండా) ఏర్పాటు చేసుకున్నారా.. లేదా.. 3 ఎర్తుపులు బిగించారా.. లేదా.. అన్న విషయాలను నిర్ధారించినవి సందట రిపోర్ట్ ఇవ్వడం జరుగుతుందని. తదుపరి సోలార్ మీటర్ బిగించడం జరుగుతుందన్నారు. సోలార్ విద్యుత్ వినియోగదారుడు బ్యాంకు ద్వారా సబ్సిడీ ఋణాన్ని పొందేందుకు దరఖాస్తు చేసుకున్న 30 రోజుల లోపు నగదును నేరుగా బ్యాంకు ఖాతాలో జమచేయడం జరుగుతుందన్నారు.

## జక్కా వెంకయ్య 7వ వర్ధంతి వేడుకలు



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** కామ్రేడ్ జక్కా వెంకయ్య 7వ వర్ధంతి సందర్భంగా మర్రిపాడులో పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సీపీఎం పార్టీ సీనియర్ నాయకుడు మహ్మద్ గౌస్ అధ్యక్షతన గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మహ్మద్ గౌస్ ఆయన జ్ఞాపకాలు స్మరించు కున్నారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ మండల కార్యదర్శి సయ్యద్ రహంతుల్లా మాట్లాడుతూ.. నెల్లూరు జిల్లా కమ్యూనిస్టు ఉద్యమంలో ఆయన ప్రముఖ పాత్ర వహించారన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రతినిధిగా వారి హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయేరు. బాబ్రీ మసీదు కూల్చివేత సందర్భంగా జరిగిన మతకలహాలు జిల్లాలో జరుగకుండా నిరోధించడంలో వెంకయ్య కీలకంగా వ్యవహరించి అందరి మన్ననలు పొందారు. నేటి యువతకు ఆయన ఆశయాలు, పోరాటాలు ఆదర్శం కావాలన్నారు. మూలి వెంగయ్య మాట్లాడుతూ.. వెంక్కన్న చిన్న నాటినుంచే ఉద్యమాల్లో పాల్గొనడం జరిగింది. మర్రిపాడు మండలంలో అనేక సమస్యలు సోమశిల హై లెవల్ కెనాల్ పనులు కల్పించాలి మొదట 5 రోజులు నిరాహార దీక్షలు చేపట్టనుడానికి సలహాలు, వెలుకొండ ప్రాజెక్టు కోసం పోరాటం, దున్నేవాడికి భూమి దక్కాలని, జిల్లాలో అనేక చోట్ల భూపోరటం చేయడం జరిగింది. సొంత గ్రామమైన దామర మడుగులో ఎన్నో పోరాటాలు చేశారు . నాటినుండి నేటివరకు ఆగ్రమంలో కమ్యునిస్టులే పంచాతి సర్పంచి విధలు. నిర్వహించడం జరిగుతుంది. మర్రిపాడు మండలంలో కూడ యంక్కన్న సలహా మేరకు అనేక గ్రామాల్లో భూపోరటం చేయడం జరిగింది. ఆయన జీవిత చరిత్ర చెప్పుకుంటా పోతే మరెన్నో ఉన్నవి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి, రత్నయ్య, సీనియర్ నాయకుడు మహ్మద్ గౌస్, సూర్య నారాయణ, సుధాకర్, ముప్పల్ల తిరుపతి, హాజరత్తయ్య, కాజావలి, పోలి రెడ్డి, జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు కొక్కంటి పోలయ్య, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

# మహానాడుకు భారీగా తరలిన పార్టీ శ్రేణులు

**జలదంకి, మేజర్‌న్యూస్ :** కడపలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమం మూడో రోజు కూడా జలదంకి మండలం నుండి తెలుగు తమ్ముళ్లు భారీగా తరలినారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సూచనలతో మండల నాయకులు ఆధ్వర్యంలో మండలంలోని చిన్న క్రాక వద్ద నుండి 20 బస్సులు, కారులతో మహానాడుకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మండల యువత అధ్యక్షులు మునగాల తిరుమలరెడ్డి మాట్లాడుతూ.. తెలుగువారి ఆత్మగౌరవానికి నిలువెత్తు రూపం తెలుగు ప్రజల ఖ్యాతిని ప్రపంచ దేశాల్లో చాటి చెప్పిన నందమూరి తారక రామారావు జయంతి వేడుకలు మహానాడులో జరిగాయి అన్నారు. కడపలో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ మహానాడు చరిత్ర సృష్టించబోతుందని అన్నారు. గాడి తప్పిన వైసిపి పాలనను గాడిలో పెట్టి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకు మంచి పరిపాలన అందిస్తున్నారని అన్నారు. అన్నదాతకు అన్ని విధాల ఖండ దండలు అందిస్తున్న ప్రభుత్వంగా కుటమి ప్రభుత్వం పేరు




తెచ్చుకుందని అన్నారు. ప్రజలే దేవుళ్ళుగా కార్యకర్తలే పార్టీగా చెబుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువ నాయకుడు లోకేష్ బాబులు రాష్ట్రాన్ని అభివృద్ధి పదంలో నడిపిస్తున్నారని అన్నారు. జలదంకి మండలం నుండి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఎంతో భారీగా స్వచ్ఛందంగా రావడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పులుగుంట మధు మోహన్ రెడ్డి, వంటేరు జయ చంద్రారెడ్డి, తల్లపునేని మధుసూదన్ రావు, గంట అశోక్, మట్టెపు ఏడుకొండలు, మందపల్లి మాల్యాద్రి, నక్కా మాధవ్ రావు, సింగమనేని మనోజ్ కుమార్, సుదీర్ బాబు, గుర్రం ప్రవీణ్, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాసులు నాయుడు, రఘు, హరి, మండలంలోని టిడిపి నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# తూనికల మిషన్ల పరిశీలన



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం జూన్ నెల నుండి రేషన్ పరిధిలో డీలర్ల ద్వారా పంపిణీ చేస్తున్న నేపథ్యంలో గురువారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో డీలర్లు షాపులకు చెందిన వేయింగ్ మిషన్లను తూనికల కొలతల అధికారి జాన్ శామ్సన్ తనిఖీ చేశారు. వేయింగ్ మిషన్‌లలో బరువులలో తేడాలు ఉంటే సరిచేసి సీల్ వేశారు. ఈ సందర్భంగా డీలర్లతో తహసిల్దార్ అమిత్ మాట్లాడుతూ.. లబ్ధిదారులతో సక్రమంగా సకాలంలో రేషన్ అందించాలన్నారు. షాపులకు రాలేని వృద్ధులకు వికలాంగులకు ఇంటి వద్దకు సరుకులు అందజేసేలా ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు రేషన్ పంపిణీలో అవకతవకలు జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ చేవూరు శ్రీనివాసులు, ఆర్ఐ ఇమ్రాన్, వీఆర్వోలు డీలర్లు తదితరులు ఉన్నారు.

# మహానాడులో బోగోలు టీడీపీ నాయకులు



**బోగోలు, మేజర్‌న్యూస్ :** కడప పట్టణంలో జరిగిన మహానాడు వేడుక సందర్భంగా గురువారం ప్రముఖ టీడీపీ నాయకులు రంగారెడ్డి నివాసం ఉన్న కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిని బోగోలు మండలం నాగులవరం పంచాయతీ టీడీపీ నాయకులు, మహిళా నాయకురాలు కంచర్ల మాధవి, నాగులవరం మాజీ సర్పంచులు గణేష్, రమేష్‌రెడ్డి, నందిపాడు పద్మనాభం, ప్రస్తుత సర్పంచ్ రాగలగడ్డ రామారావు, నాగులవరం నీటి సంఘం మాజీ సర్పంచ్ కంచర్ల రమణయ్య, నాగులవరం టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు గన్నవరం శ్రీనివాసులు గ్రామ కలిశారు. టీడీపీ నాయకులు మాలేపాటి శ్రీహరి నాయుడు, ఆలూరు వేణు, చంద్ర, ఏలియా తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.

# వడ్డెర ఉద్యోగస్థుల సంక్షేమమే ప్రధాన లక్ష్యం

## వడ్డెర ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు



**నెల్లూరు / వేదాయపాళెం, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ వడ్డెరకుల ఉద్యోగుల అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన అజెండాలతో కూడిన లక్ష్యసాధనగా ఎంచుకొని ముందుకు సాగుతున్నట్లు వడ్డెర ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, విశ్రాంత ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నంద్యాల శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఆయన విడుదల చేసిన ప్రకటనలోని వివరాలిలా ఉన్నాయి. ఉమ్మడి జిల్లాల్లోని ఇరిగేషన్, -పోలీస్. విద్యుత్, ఫారెస్ట్, రెవెన్యూ, వ్యవసాయ, హౌసింగ్, పంచాయతీరాజ్ తదితర విభాగాల్లో పనిచేస్తున్న 1000 మంది పైచిలుకు వడ్డెర -ఉద్యోగుల సమస్యల పరిష్కారం, న్యాయ బద్దమైన డిమాండ్ల సాధన, ఉద్యోగ భద్రత, పారదర్శకంగా పదోన్నతులు తదితర అంశాలలో న్యాయం చేసే అజెండాతో 2008లో ఆవిర్భవించిన వడ్డెర ఉద్యోగుల సంక్షేమ సంఘం ద్వారా గడిచిన 17ఏళ్లలో వందలాది మంది ఉదో ్యగస్థుల సమస్యలకు తగిన పరిష్కారాలతో లబ్దిచేకూర్చడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాల్లోని నెల్లూరు టౌన్, నెల్లూరు రూరల్, కోవూరు, కావలి, ఆత్మకూరు, ఉదయగిరి, వెంకటగిరి, గూడూరు, సూళ్లూరుపేట అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఉన్న ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్నవడ్డెర ఉద్యోగస్థులను మరికొన్ని సమస్యలు, వృత్తిపరమైన అసౌకర్యాలు, ఇబ్బందుల రూపంలో వెంటాడుతున్నట్లుతమ దృష్టికి వచ్చిందన్నారు. న్యాయమైన డిమాండ్ల సాధన, సమస్యలను పరిష్కరించుకోవడంలో తారతమ్యాలు లేకుండా అందరూ కలిసికట్టుగా సమన్వయమై ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్లో కూడా ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ అన్నిరకాలుగా వడ్డెర ఉద్యోగులకు అండగా నిలుస్తామని ఆయన భరోసా ఇచ్చారు. తల్లిలాంటి అటవీశాఖలో చిన్నా.. పెద్దా అన్న తారతమ్యాలు లేకుండా అన్నిస్థాయిల ఉద్యోగులు సమన్వయంతో పనిచేయడం, కష్టసుఖాలను ఆత్మీయతతో పాలుపంచుకునే మనస్థత్వాలు వెరచి ఆరోగ్యకర కుటుంబ సభ్యుల నేపథ్యం ఉంటుందని, ఉద్యోగ విరమణతో చక్కటి కుటుంబం లాంటి అటవీశాఖకు దూరం కావడం బాధగా ఉన్నప్పటికీ. సర్వీసులో ఉన్నప్పుడు పాటించిన నిబద్ధత. క్రమశిక్షణ, సహెూద్యోగుల సహకారం, సాధించిన పురోగభివృద్ధి. ఉన్నతాధికారుల నుంచి పొందిన ప్రశంసల తాలూకు తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ శేషజీవితాన్ని సంతోషంగా గడపాలని నిర్ణయించుకున్నట్లు ఆయన తెలిపారు.

# ఘనంగా జక్కా వెంకయ్య ఏడవ వర్ధంతి



**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట మండలం లో సిపిఎం సిఐటియు ఆధ్వర్యంలో ఉద్యమ నేత జక్కా వెంకయ్య 7వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు ఖాదర్ బాషా మాట్లాడుతూ.. జక్కా వెంకయ్య ప్రజాసేవకుడు ప్రజల కోసం పోరాడుతూ ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూతన జీవితాంతం పార్టీకి అంకితం చేసిన మంచి మనిషి జక్కా వెంకయ్య అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా సిఐటియు అధ్యక్షులు టీవీవి ప్రసాద్, సిపిఎం ఉపాధ్యక్షులు మైపాటి కోటేశ్వరరావు, మండల అధ్యక్షుడు ఎస్.కె చాన్‌భాషా, వాసు, దయాసాగర్, సీపీఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

# అండర్ బ్రిడ్జిల వద్ద నీరు నిలవకుండా చర్యలు తీసుకోండి

## కమిషనర్ వై.ఓ నందన్

**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అండర్ బ్రిడ్జిల వద్ద వర్షపునీరు నిలిచి ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ నీటిని తొలగించేయాలని కమిషనర్ వైఓ నందన్ అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 10వ డివిజన్ బాబూ గిరిజన కాలనీ, 17వ డివిజన్ పార్థసారథి లేఔట్ తదితర ప్రాంతాలలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు, డ్రైను కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులు, డ్రైన్ కాలువలు, సిసి రోడ్ల నిర్మాణం పనులను కమిషనర్ గురువారం తనిఖీ చేశారు. డివిజన్ వ్యాప్తంగా వివిధ భవనాలకు కొలతలు వేసి అసెస్మెంట్ డిమాండ్లను తనిఖీ చేశారు. అనధికార, అక్రమ నిర్మాణాలను గుర్తించి తొలగించాలని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు సూచించారు. అనంతరం స్థానిక రామలింగాపురం అండర్ బ్రిడ్జి సమీపంలోని యు.జి.డి సెక్షన్ పంప్ హౌస్ ను కమిషనర్ పరిశీలించి పనితీరును తనిఖీ చేశారు. వర్షాకాలం నేపథ్యంలో అండర్ బ్రిడ్జిలలో వర్షపు నీరు చేరి ప్రయాణికులకు



ఆటంకం కలిగించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ శానిటేషన్, ఇంజనీరింగ్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వం మారినా.. ఆగని మట్టి దందా

**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తి కావస్తుంది ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే అక్రమ మట్టి మాఫియాపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. కానీ ఈ హెచ్చరికలన్నీ బేఖాతరు చేస్తూ మట్టి మాఫియా రెచ్చిపోతుంది. వివరాల్లోకి వెళితే సర్వేపల్లి నియోజకవర్గం తోటపల్లి గూడూరు మండలంలో అక్రమ మట్టి మాఫియా రెచ్చిపోతుంది. ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి రవాణా సాగిస్తున్నారు. సాధారణంగా మట్టి రవాణా చేయాలంటే అటు రెవెన్యూ అనుమతులు మరోవైపు పోలీసుల అను మతి తప్పనిసరి. కానీ ఇక్కడ ఎటువంటి అనుమతులు లేకుండా బుధవారం రాత్రి కప్పలదొరువు నుంచి తోటపల్లి గూడూరులోని ఒక ఇటుక రాయి బట్టీకి టిప్పర్లతో మట్టిని తరలించారు. వారికి ఎటువంటి అనుమతులు లేవని సమాచారం. ఒక్కో టిప్పర్ మట్టి విలువ సుమారు 6వేల నుంచి 7వేల వరకు ఉండడంతో అక్రమ మట్టి మాఫియా వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుంది. అక్రమ మట్టి వ్యాపారంపై మొదటి



నుంచి ఆగ్రహంగా ఉన్న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఇలాకాలో ఈ ఘటన జరగడం గమనార్హం.

# మహానాడులో ఉదయగిరి సత్తా చాటిన ఎమ్మెల్యే కాకర్ల





**వింజమూరు, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా కడపలో చేపట్టిన మహానాడు కార్యక్రమానికి ఉదయగిరి నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో తరలి వెళ్లారు. ఉదయం 8 గంటలకే కలిగిరి కొండాపురం జలదంకి మండలాల నుండి వింజమూరు తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయం దగ్గరకు చేరుకోగా ఎమ్మెల్యే నాయకులకు స్వాగతం పలికి వింజమూరు నుండి దుత్తలూరు బయలుదేరి వెళ్లారు. దుత్తలూరులో వరికుంటపాడు ఉదయగిరి సీతారాంపురం మండలాల నుండి వివిధ వాహనాలలో విచ్చేసిన నాయకులను కాకర్ల ఆత్మీయంగా పలకరించి ఒక్కసారిగా జై చంద్రబాబు జై నారా లోకేష్ జై కాకర్ల అంటూ నినాదాలతో వాహన శ్రేణి కదిలింది. గత గతంలో ఎన్నడూ కూడా ఇంత పెద్ద ఎత్తున వాహనాలలో ఉదయగిరి నియోజకవర్గంలో నుండి తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు తరలి వెళ్లిన సందర్భం లేదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కాకర్ల సురేష్ నాయకత్వం పై నమ్మకంతో నియోజకవర్గంలోని ప్రతి మండలంలో పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు అభిమానులు తరలి వెళ్లడమే ఇందుకు నిదర్శనమని పలువురు భావించారు. నియోజకవర్గంలో ప్రతి మండలం నుండి 200 బస్సులు సుమారు 2500 కార్లలో తరలి వెళ్లడం తెలుగుదేశం పార్టీ పై ప్రజలకున్న అభిమానం వ్యక్తం అవుతుంది.

# ఏపీఎస్పీడిసిఎల్ జనరల్ మేనేజర్‌కు శుభాకాంక్షలు

**నెల్లూరు / వేదాయపాళెం, మేజర్‌న్యూస్ :** ఏపీ దక్షిణప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ తిరుపతి ప్రధాన కార్యాలయ నూతన జనరల్ మేనేజర్ (సివిల్)గా భాద్యతలు స్వీకరించిన కె.శ్రీనివాస రావును గురువారం ఆయన ఛాంబర్లో మర్యాద పూర్వకంగా కలిసిన నెల్లూరు సర్కిల్ పరిధిలోని పలువురు ఇంజనీరింగ్, పరిపాలన విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పుష్పగుచ్చాలు అందజేసి ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపారు. నెల్లూరు జిల్లాకు చెందిన కె.శ్రీనివాసరావు సివిల్ డివిజన్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా పని చేస్తూ జనరల్ మేనేజర్‌గా పదోన్నతి పొందారు. ఈక్రమంలోనే నెల్లూరు సర్కిల్ ఇంజనీరింగ్, పరి పాలన విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది తిరుపతి ప్రధాన కార్యాలయంలో ఏపీ ఎస్పీడిసిఎల్ డైరెక్టర్ గురవయ్య చీఫ్ జనరల్



మేనేజర్ (హెచ్‌ఆర్‌డి అండ్ ప్రాజెక్ట్స్) రమణదేవి, మరో చీఫ్ జనరల్ మేనేజర్ కె.ఆదిశేషయ్యలను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో నెల్లూరు టౌన్, కోవూరు విద్యుత్ ఆపరేషన్, సివిల్ డివిజన్స్ విభాగాలకు చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు మన్నేపల్లి శ్రీధర్, రమేష్ చౌదరి, విష్ణువర్ధన్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఆకురాతి అశోక్, నరసింహారావు, రమేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



## మహానాడుకు తరలిన నేతలు, కార్యకర్తలు

**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశానుసారంలో భాగంగా కడపలో జరుగుతున్నటువంటి మహానాడు కార్యక్రమానికి మాజీ జిల్లా తెలుగు యువత అధ్యక్షులు ఏలూరు మాల్యాద్రి నాయుడు ఆధ్వర్యంలో అనుముసముద్రంపేట మండలం కావలి యడవల్లి గ్రామం నుంచి 120 మంది బస్సులలో ఇతర వాహనాల్లో తరలివెళ్లారు.

## సోలార్ విద్యుత్ వాడకాన్ని ప్రోత్సహించండి



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగస్తులు తమ గృహాలకు సోలార్ ప్యానల్‌లను ఏర్పాటు చేసుకొని విద్యుత్ ను వినియోగించుకోవాలని, ప్రతి ఒక్కరికి సోలార్ విద్యుత్ వాడకంపై ప్రోత్సాహం కల్పించాలని కమిషనర్ వైఓ నందన్ పేర్కొన్నారు. సోలార్ విద్యుత్ వినియోగంపై వివిధ కంపెనీల ప్రతినిధులు కార్పొరేషన్ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను కమిషనర్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సోలార్ విద్యుత్ వాడకంతో విద్యుత్ చార్జీలను పూర్తిగా తగ్గించుకోవచ్చని తెలిపారు. దాదాపుగా 90శాతం వరకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తున్నారని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పర్యావరణహితమైన సోలార్ విద్యుత్ వినియోగంపై అందరూ అవగాహన పెంచుకొని సోలార్ ప్యానల్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం స్టాళ్లలో ప్రదర్శనకు ఉంచిన వివిధ కంపెనీల సోలార్ ప్యానల్ లను కమిషనర్ పరిశీలించి వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## శాంతి స్వరూపిణి అవతారంలో వింధ్య పరమేశ్వరి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరుకు నైరుతి దిక్కున కొండమీద వెలసియున్న శ్రీ విద్య పరమేశ్వరి అమ్మవారు బ్రహ్మో త్సవాలలో భాగంగా గురువారం శాంతి స్వరూపినిగా భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. వింజమూరు భక్త బృందం, గ్రామస్తుల దాతలుగా అమ్మవారి పూజా కార్యక్రమాలను జరిపిం చారు. ఉదయాన్నే అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు పూజా కార్యక్రమాలు జరిపించి అమ్మ వారిని శాంతి స్వరూపిణిగా సర్వాంగ సుందరంగా సర్వాభరణాలతో సుగంధ పుష్ప పరిమళ మాల లతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. అమ్మవారిని పల్లకిపై ఎక్కించి ఆలయం చుట్టూ ముమ్మారు ప్రదక్షణ గావించారు. భక్తులు అమ్మవారి పల్లకిని మోసేందుకు పోటీలు పడ్డారు. తీర్థప్రసాదాలు స్వీకరించి అమ్మవారిని కనులారా దర్శించి పునీతులయ్యారు.

## ఆస్తి పన్నుపై రీ సర్వే ఒకే విధంగా జరపాలి



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** చింతారెడ్డిపాళెంలో ఆస్తి పన్నుపై రీ సర్వే ప్రక్రియ ఒకేవిధంగా చేయాలని వైసీపీ నాయకులు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. అలాగే ఇళ్ళకు ఆస్తి పన్ను విషయమై రీ సర్వే చేయాల్సి ఉండగా.. కొన్ని ప్రాంతాలలో వైసీపీకి చెందిన ఇళ్ళకు మాత్రమే కొలతలు తీసుకొని ఆస్థి పన్ను రీ సర్వే చేస్తున్నట్లు వారు తెలిపారు. ఇలా చేయటం పూర్తిగా కక్ష సాధింపు చర్య అని పేర్కొన్నారు. అదేవిధంగా చింతారెడ్డిపాళెంలో అన్ని ఇళ్ళకు ఆస్థి పన్ను రి సర్వే ప్రక్రియ ఒకే విధముగా జరపాలని సంబంధిత సచివాలయ సిబ్బందికి తగు సూచనలు జారీ చేయవలసిందిగా కమీషనర్‌ను వారు కోరారు. అనంతరం కమీషనర్‌కి చింతారెడ్డిపాళెం వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.